క్లుప్తంగా

దేశ సుస్థిరాభివృద్ధి పీఎం మోదీతోనే సాధ్యం



భీమడోలు బీజేపీ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు

భీమడోలు: దేశం సుస్థిరాభివృద్ధి పీఎం నరేంద్ర మోదీతోనే సాధ్యమని ఉంగుటూరు నియోజక వర్గ బీజేపీ కో కన్వీనర్ వెజ్జు ధర్మారావు అన్నారు. భీమడోలు మండల బీజేపీ కార్యాలయంలో మంగళవారం మూడోసారి పీఎంగా నరేంద్రమోదీగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేశారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ప్రవీణ్ పటేల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. దేశానికి పీఎంగా మూడుసార్లు పీఎంగా పని చేసి భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో సమంగా నిలిచి రికార్డును సొంతం చేసుకున్నారు. దేశానికి ప్రపంచ దేశాల్లో గుర్తింపు రావడానికి మోదీ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాసుశాస్త్రి, ఏలూరు మహిళామోర్చా ఉపాధ్యక్షుడు మిద్దే రమాదేవి, నాయకులు కపిరాజు, బీబీజాన్, కె.హనుమంతరావు, రాఘవ, నీలం గోపాలం, పద్మనాభం, శాస్త్రి పాల్గొన్నారు.

సీపీఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి



గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: అన్యాయంగా మూసివేసిన గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీని తెరిపించి అందులో పనిచేస్తున్న వారికి న్యాయం చేయాలని ఉద్యోగు లు డిమాండ్ చేశారు. మంగళవాఇరం గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీపీఎఫ్ కంపెనీ ఎదురుగా వారం రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న కంపెనీ ఉద్యోగులు అక్కడి నుంచి ప్రదర్శనగా నినాదాలు చేస్తూ గణపవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు సీపీపీఎఫ్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. కంపెనీని వెంటనే తెరిపించేందుకు కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.పెంటారావు, పి.గోవింద్, గుత్తుల శ్రీనివాస్, దండు రామలింగరాజు పాల్గొన్నారు.

కన్యస్త్రీగా సిస్టర్ మణీంద్ర

పెదవేగి : తన జీవితాన్ని దేవుని సేవకు అంకితం చేసిన సిస్టర్ మేరీ మణీంద్ర కన్యస్త్రీగా దైవ చింతనలో ఎన్నో విజయాలు సాధించాలని ప్రావిన్షియల్ ఫాదర్ క్రీస్తురాజు, విచారణ గురువులు ఫాదర్ బాలస్వామి అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లి విచారణ దేవరపల్లివారిగూడెంకు చెందిన దేవరపల్లి మేరీ మణీంద్ర ఎస్ఎండీ సంస్థలో వెస్ట్ బెంగాల్ కమల్పూర్‌లో మొదటి పట్టు స్వీకరించి మంగళవారం స్వగ్రామంలో మొదటి కృతజ్ఞత దివ్య బలిపూజను ఫాదర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు గురువులు, కన్యస్త్రీలు, కుటుంబ సభ్యులు, సంఘ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాపారాలతో అభివృద్ధి చెందాలి

ఏలూరు టౌన్: ప్రభుత్వ సహకారంతో సక్రమంగా వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ ఛాంబర్‌లో మంగళవారం చేపట్టిన కార్యక్రమంలో ఏలూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ కార్యాలయ సమీపంలో కార్పొరేషన్ కాంప్లెక్స్‌లోని షాపుల లీజుదారులు 20 మందికి మూడేళ్ల కాల పరిమితి పెంచుతూ, 33 శాతం అద్దెను పెంచుతూ రెన్యువల్ చేసి పత్రాలను మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రభుత్వం సహకారాన్ని అందిస్తోందని తెలిపారు. అదే విధంగా అద్దె బకాయిలు ఉన్న లీజుదారులు సకాలంలో బకాయిలు చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించాలని మేయర్ నూర్జహాన్ కోరారు. కోఆప్షన్ సభ్యుడు పెదబాబు మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 25 మున్సిపల్ కాంప్లెక్స్‌లో 657 షాపులు ఉన్నాయని తెలిపారు. ఈ షాపుల ద్వారా అద్దె రూపంలో వచ్చే ఆదాయంతో కార్పొరేషన్ నిర్వహణ చేపడతామని తెలిపారు. బకాయిలు ఉన్న షాపుల యాజమాన్యాలు సకాలంలో అద్దెలను చెల్లిస్తే నగరంలోని ప్రజలకు కార్పొరేషన్ ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, శోభ, మీనాక్షి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పవన్, సాయి, లీజుదారులు ఉన్నారు.

ఊపిరి ఉన్నంత వరకూ ప్రజాసేవలోనే



నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

- మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పార్టీ శ్రేణులతో సమావేశం

గణపవరం: తన ఊపిరి ఉన్నంతవరకూ ప్రజాసేవలోనే ఉంటానని, గెలుపోటములు సమానంగా తీసుకోవడమే నాయకుని లక్షణమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమికి కుంగిపోకుండా కార్యకర్తలంతా ధైర్యంగా వారి కార్యకలాపాలను కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినందున మనమంతా వాటిపైనే ఎక్కువ దృష్టి సారించామని ఈ క్రమంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు సరిగ్గా వివరించలేకపోయామని అన్నారు. ఎంత చేసినా పచ్చపార్టీ, ప్రతిపక్షాలు, పచ్చమీడియా ప్రభుత్వంపై అదేపనిగా అసత్య ప్రచారాన్ని కొనసాగించి ప్రజలను తప్పుదోవ పట్టించాయన్నారు. ప్రజలకు, రైతులకు ఎంతో ఉపయోగకరమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ప్రతిపక్షాలు, పచ్చమీడియా అదే పనిగా దుష్ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలు కలిగించడం కూడా మనకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. కూటమిగా ఏర్పడిన వారి దుష్ట పన్నాగాలు, దుష్ప్రచారం, ప్రజలకు ఆచరణసాధ్యం కాని హామీలు గుప్పించి వారు అధికారంలోకి వచ్చారన్నారు. ఉంగుటూరు నియోజకవర్గాన్ని సుమారు రూ.1,600 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించినట్లు వాసుబాబు తెలిపారు. అవినీతి మరక అంటకుండా నిజాయతీగా ఐదేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేశానని, రాజకీయాల్లో ఉన్నంతకాలం ఇలాగే నీతివంతంగా నడుచుకుంటానని వాసుబాబు అన్నారు. పదేళ్లుగా నియోజకవర్గ ప్రజలతోనే ఉన్నానని, కరోనా కాలంలో రెండేళ్లు ప్రజల్లోనే ఉండి వారికి అవసరమైన సేవలు అందించానన్నారు. ఇక ముందు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవలందిస్తానని చెప్పారు. ప్రజా తీర్పును గౌరవిస్తానని, రాజకీయాల్లో గెలుపు ఓటమి సహజమని, నేటి ఓటమిని రేపటి విజయానికి తొలి మెట్టుగా తీసుకుని, పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. త్వరలో మండల, గ్రామస్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించుకుందామని చెప్పారు. ఓటమి చెందిన వారిపై దాడులు చేయడం గర్హనీయమని అన్నారు. నియోజకవర్గంలో తనకు అండగా నిలిచిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ధర్మరాజుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు వాసుబాబు ఓటమి జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. వాసుబాబు లాంటి నిజాయతీ పరుడైన నాయకులకు ప్రజలు అండగా ఉండాలన్నారు. ఇక ముందు కూడా తామంతా వాసుబాబుకు అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి శ్రీనివాస్, ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, కనువర రాజయ్య, గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీలు దేవారపు సోమలక్ష్మి, కోడే కాశి, కొరిపల్లి జయలక్ష్మి, తుమ్మగుంట భవాని, పార్టీ నాయకులు గాజుల వెంకటేశ్వరావు, ఎస్ఎస్ బాజీ, ముళ్లగిరి జాన్సన్, వడ్డి ఉమ, ఎలిశెట్టి బాబ్జి, ఏఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ముగిసిన సెలవులు.. తెరుచుకోనున్న బడులు



గణపవరం స్టాక్ పాయింట్ వద్ద నోట్ బుక్ బాక్స్‌లు



పాఠ్యపుస్తకాలను పాఠశాల పాయింట్‌కు చేర్చేందుకు కట్టలు కడుతున్న సీఆర్‌పీలు

- 13న పాఠశాలల పునఃప్రారంభం
- మధ్యాహ్న భోజన పథకం సరుకుల పంపిణీ పూర్తి
- జేవీకే కిట్ల పేరును స్టూడెంట్ కిట్లుగా మార్పు
- మండలాలకు చేరుకోని బ్యాగులు, యూనిఫాం, షూలు



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న ఏజెన్సీ సిబ్బంది



జల్లికొమ్మరలో పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఆయా

నిడమర్రు: విద్యార్థులకు వేసవి సెలవులు ఈనెల 11తో ముగిసి 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉండగా సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కారణంగా ఒక రోజు వాయిదా వేస్తూ 13వ తేదీన బడులు తెరుచుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. పాఠశాలలు తెరుచుకునే నాటికి పాఠశాల ప్రాంగణం, పరిసరాలు, తరగతి గదులు, వంట గది, తాగునీటి ట్యాంక్ వంటివి పరిశుభ్రంగా ఉండేలా డీఈవో పలు సూచనలు ప్రధానోపాధ్యాయులకు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు వంటివి ఇప్పటికే పాఠశాల పాయింట్లకు చేరుకుంటున్నాయి. 13వ తేదీనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు వంటి కిట్లు పాఠశాల పాయింట్స్‌కు అందించేలా అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

నియోజకవర్గానికి 18,729 కిట్లు

గత ప్రభుత్వ హయాంలో 1 నుంచి 10వ తరగతి వరకూ జగనన్న విద్యాకానుక పేరుతో ఏటా ప్రభుత్వ విద్యార్థులకు విద్యాసామగ్రి అందించేది. వీటిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, 3 జతల యూనిఫాం, ఒక జత బూట్లు, 2 జతల సాక్స్, బెల్ట్, ఇంగ్లీష్ డిక్షనరీ పంపిణీ చేసేవారు. ప్రభుత్వం మారడంతో జగనన్న విద్యాకానుక పేరును స్టూడెంట్ కిట్లుగా పేరు మారుస్తూ ప్రభుత్వం నుంచి విద్యాశాఖ అధికారులకు లిఖితపూర్వక ఆదేశాలు అందినట్లు చెపుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 18,729 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందించాలని ఆయా మండల విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి మండల స్టాక్ పాయింట్స్‌కు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు మాత్రమే చేరినట్లు అధికారులు తెలిపారు. 13వ తేదీ నుంచి పాఠశాల స్టాక్ పాయింట్లకు చేర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో కిట్లు

మండలం	స్టూడెంట్ కిట్లు
ఉంగుటూరు	6,291
భీమడోలు	4,893
గణపవరం	4,462
నిడమర్రు	3,083
మొత్తం	18,729

జిల్లా విద్యాశాఖ సూచనలు

- తరగతి గదులు, వంటగది, స్టోర్ రూములను ఆయాల సహకారంతో పరిశుభ్రం చేయించాలి, వంట గదిలో గోడల మధ్య బూజులు, బొద్దింకలు, ఎలుకలు వంటివి లేకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.
- పాఠశాల పాయింట్లకు వస్తున్న కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, బెల్లం పిండి నిల్వ ఉన్నట్లు గమినిస్తే హెచ్ఎంలో తీసుకోకుండా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.
- పాఠశాల యందుగల మంచినీటి సరఫరాకు సంబంధించిన ఓవర్ హెడ్, సంపు ట్యాంక్‌ల్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, ట్యాంక్‌లను క్లోరినేషన్‌తో క్లీనింగ్ చేయించాలి.
- టాయిలెట్లు, మరుగుదొడ్లను క్లీనింగ్ విషయంలో ఆయాలచే పాఠశాలకు సరఫరా చేసిన కెమికల్స్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ రిజిస్టర్లు క్రమం తప్పకుండా నిర్వహణను 13వ తేదీ నుంచే నిర్వహించాలి.

భోజన పథకం సరుకులు పంపిణీ పూర్తి చేసేలా చర్యలు



13వ తేదీలోపు అన్ని పాఠశాలల పాయింట్స్ వద్దకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన జూన్‌లో ఇండెంట్ ప్రకారం బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి, బెల్లం పిండి చేరుకునేలా చర్యలు తీసుకున్నాం. డీఈవో ఎస్ అబ్రహం సూచనలు మేరకు పాఠశాలలోని తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశాం. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు స్టూడెంట్ కిట్లు పంపిణీ ప్రారంభిస్తాం.

– జి. బాలయ్య, ఎంఈవో–2, గణపవరం

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలి



గణపవరం బాలికల హాస్టల్‌లో దోమల మందు పిచికారీ చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: విద్యాసంస్థలు, హాస్టళ్లను పునఃప్రారంభించే నాటికి తరగతి గదులు, హాస్టల్ గదులను పరిశుభ్రంగా ఉంచాలని, కీటక నాశన మందు పిచికారీ చేసి, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం గణపవరంలోని పలు విద్యాసంస్థలు, హాస్టళ్లను ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చారు. దోమల కారణంగా అనేక అంటువ్యాధులు వ్యాప్తి చెందుతాయని అందువల్ల దోమల నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టల్ గదులు, పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేశారు. విద్యాసంస్థల సమీపంలో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని వార్డెన్లకు సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం



అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

పెదపాడు: అప్పనవీడులో అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పురస్కరించుకుని 200 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోళ్లపల్లి సత్యన్నారాయణ, ప్రదీప్‌కుమార్ రాజు, సయ్యపు రాజు శ్రావణి, కోళ్లపల్లి అయాన్ సాయి సహకారం అందించారు. తొలుత స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం



గుండుగొలనులో అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేస్తున్న వైద్యురాలు కె.శ్రీలక్ష్మీ, వైద్య ఆరోగ్య సిబ్బంది

భీమడోలు: మలేరియా రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ అన్నారు. గుండుగొలనులో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా గ్రామంలోని వైద్య బృందం, ఆశా వర్కర్లు అవగాహన ర్యాలీ, ప్రదర్శన చేశారు. కరపత్రాలు అందించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఏటా జూన్ ఒకటో తేదీ నుంచి జూన్ నెలాఖరు వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించి ప్రజల్లో మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. శుక్రవారం ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. ఇండ్లలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కె.మల్లేశ్వరరి, ఎంపీహెచ్ఎస్ డి.రామకృష్ణ, హెచ్‌వీ షేక్ నవీన్, హెల్త్ అసిస్టెంట్లు రమేష్; మురళీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నివారణ అందరి బాధ్యత

గణపవరం: మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.ప్రియాంక, సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో మలేరియా అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాలలో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పాత సామాన్లు వంటివి ఇళ్ల దగ్గర ఉంచరాదన్నారు. దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడాలని, దోమల నివారణ కాయిల్స్ వాడాలని సూచించారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత



పెదవేగిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

పెదవేగి : దోమలు మానవాళికి ప్రధాన శత్రువులుగా పరిణమించయని, దోమల ద్వారా మలేరియా డెంగీ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయి కాబట్టి దోమల నిర్మూలన ప్రజల భాగస్వామంతోనే సాధ్యపడుతుందని, దోమల నిర్మూల ప్రజల సామాజిక బాధ్యతగా భావించాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెదవేగి ఆశా డే కార్యక్రమంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యునితో పరీక్షించుకుని చికిత్స పొందాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జే. గోవిందరావు మాట్లాడుతూ మంచి నీటిలో పెరిగి మన గృహాల్లో ఉండి మన రక్తాన్ని తాగి మనకే ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్ గునియా, మెదడువాపు మొదలు అంటు వ్యాధులు వ్యాప్తి చేసే దోమలు మనకు నిజమైన శత్రువులని, దోమలు పెరిగే స్థలాలైనా నీటి నిల్వ ప్రాంతాలు డ్రమ్ములు, మూతలు లేని నూతులు, టైర్లు, పగిలిపోయిన వస్తువులు, కొబ్బరి బొండాలు, సంపులు, రుబ్బురోలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనుక బాక్సు తదితర స్థలాల్లో దోమలు పెరుగుతాయన్నారు. ప్రజలందరూ వారానికి ఒకటి లేక రెండుసార్లు నీటి నిలువ ప్రాంతాల్లో క్లీన్ చేసుకోవాలని పనికిరాని వస్తువులు విసర్జించాలని సాయంత్రం సమయంలో కిటికీలు, దోమ తెరలు, మస్కిటో కాయిల్స్, వాడాలని, దోమలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పూర్ణిమ, మాధవి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మంగమ్మ హెల్త్ సూపర్‌వైజర్స్ రమేష్, యామిని, సుజాత, హెల్త్ అసిస్టెంట్స్ ఎం శ్రీనివాసరావు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు నూతన వస్త్రాల వితరణ



పేదలకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: ప్రతి ఒక్కరూ ఇతరులపై మానవత్వంతో మెలగాలని మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు వట్టి సుగుణాకర్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పూళ్ల, ఎంఎంపురం గ్రామాల్లోని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామాల్లోని 11 పేద కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలను అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వట్టి సుగుణాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుని వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలన్నారు. సేవాతత్వంతోనే ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆ కుటుంబాలకు బియ్యం, ఇతర సరుకులు, సాయిరామ్ క్లాత్ యాజమాని పున్నం గోపి ఆర్థిక సాయంతో నూతన వస్త్రాలను అందించారు. మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రామిశెట్టి గంగాధరరావు, మండల కార్యదర్శి ఆడబాల బాబి, అల్లాడ ప్రసాదరావు, పచ్చా వెంకటేశ్వరరావు, పులిచర్ల వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి నూతన ప్రభుత్వం సహకరించాలని ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న ప్రభుత్వానికి ఎస్సీ సర్పంచ్‌ల సంఘం తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా రానున్న ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిగా పంచాయతీలకు బదలాయించి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. పంచాయతీ సర్పంచ్‌ల హక్కుల్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో పెత్తందారుల పెత్తనం లేకుండా సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు కట్టబెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



